# కథల్రావ్ కథలు

ఎన్. విజేంద్రనాథ్ ప్రసాద్

మిస్టర్ కథల్రావు ఒక రచయిత. ఎన్నో కథలు రాసాడు. అంతకు మించిన నవలలు రాసాడు. కాని ఒక్క కథయినా అచ్చయిన పాపాన పోలేదు. అతని కథలు అన్ని పత్రికాఫీసుల గుమ్మాలను దర్శించుకొని తమ యజమాని మీద కల ప్రేమ వల్ల తిరిగి తమ జన్మ స్థానాన్ని చేరుకొన్నాయి.

ఎన్నో పుస్తకాలు చదివిన కథల్రావు, రచయితలకు నిరాశ నిస్పృహ అనేవి వుండ కూడదని, ఓర్పు, సహనం వుండాలని బాగా జీర్ణించుకొన్నాడు. అందుకే ఎన్ని కథలు తిరిగొస్తున్నా కథలు రాయడం మానలేదు.

ఏదో ఒక రోజు తాను ప్రముఖ రచయితగా పాఠకుల మనస్సుల్లో శాశ్వతంగా నిలిచి పోతాడని ఆరు మాసాల నుంచి కలలు కంటున్నాడే గాని, అవి నిజమయ్యే సూచనలు దరిదాపుల్లో ఎక్కడా కనబడటం లేదు. అయినా పట్టు వదలని విక్రమార్కుడులా రచనలు చేస్తూనే వున్నాడు.

గదిలో మిస్టర్ కథల్రావు అతని శిష్యుడు శకునేశ్వర్రావు కూర్చుని వున్నారు. మిస్టర్ కథల్రావు తన కొత్త నవల్లను ఎలా మొదలు పెడితే బాగుంటుందా అని ఆలోచిస్తున్నాడు. అతని శిష్యుడు శకునేశ్వర్రావు అప్పులాళ్ళొస్తే ఈ సారి ఏం సాకు చెప్పి తప్పించుకోవాలా అని ఆలోచిస్తున్నాడు.

ఎంత ఆలోచించినా తన ఆలోచనలు ఓ క్రమంలోకి రాక పోయేసరికి మిస్టరు కథల్రావు తన శిష్యుడి వైపు తిరిగి, "శిష్యా ఏది ఓ సిగరెట్ అందుకో." అన్నాడు.

"ఇంకా సిగరెట్లు ఎక్కడివి గురూ. మొన్ననే అయిపోయాయిగా. నిన్నకాల్చి పారేసిన తుంట బీడీలున్నాయి." అన్నాడు శిష్యుడు శకునేశ్వర్రావు.

"కాల్చి పారేసిన బీడీ విధవతో సమానము శిష్యా. అలనాడు వసుదేవుడంతటి వాడికే గాడిద కాళ్ళు పట్టుకోవాల్సి వచ్చింది. పరిస్థితులు చెప్పి రావు. అందుకో వున్న వాటిల్లో కొత్త మంచి (తుంట) బీడీ." అన్నాడు మిస్టరు కథ

్రావు తను రాయబోతున్న కొత్త నవల్లోని హీరో డైలాగులను తలచుకొంటూ.

"గురూ-యిక లాభం లేదు. నీకూ నీ కథలకు ఏదో శనిగ్రహం పట్టుకొన్నట్టుంది. ఇక కథలు రాయడం మాని డబ్బును సంపాదించే మార్గం చూసుకోకపోతే మనకు అప్పులిచ్చిన వాళ్ళు సజీవ సమాధి కడతారు." అన్నాడు శిష్యుడు

"నేను కథలు రాయడం మానాలా?—నెవర్. ఈనాడు రోజుకు నాలుగు నవలు, పది కథలు రాసే వాళ్ళు ఎలా అంత గొప్ప వాళ్ళు కాగలిగారనుకుంటున్నావు? ఈనాడు నా కథలు త్రిప్పి పంపిన ఎడిటర్లే రేపు నా రచనల కోసం గుమ్మం ముందర క్యూలో నిలబడతారు. కాకపోతే కాస్త ఆలస్య మవుతుంది." ఆ మధ్య జ్యోతిష్కుడు చెప్పనే చెప్పాడు.

అదృష్టం వెతుక్కుంటూ వచ్చి తలుపు తడుతుందని. ఏ ప్రొడ్యూసరో సినిమా రచయితగా గుర్తించేస్తాడని-

అంతలో "టక్ టక్ ...."మంటూ బయట తలుపు చప్పుడయింది.

"చూశావా శిష్యా! అదృష్టం మన తలుపు తడుతోంది నా నవల కొనడానికి ఏ పబ్లిషరో, లేక ఏ ఫిలిం ప్రొడ్యూసరో వచ్చుంటాడు వెళ్ళి తలుపు తీసి లోనికి ఆహ్వానించు." అన్నాడు మి. క.

"గురూ! కొంపదీసి అప్పులాళ్ళు కాదుగదా?"

"ఛీ ....! అపశకునపక్షి, అశుభం మాటలు పలుకక, వెంటనేవెళ్ళి తలుపు తీసి వచ్చిన వ్యక్తి నన్ను చూడాలంటే ప్రస్తుతం ఓ ఫిలిం ప్రొడ్యూసరు కోసం ఓ నవల రాస్తున్నారు తరువాత రమ్మను. చాలా అర్జంటుగా చూడాలంటే లోపలికి తీసుకురా. తరువాత వస్తాలెండి అని వెళ్ళిపోదోతే వుండండి, ఒకసారి అడిగి వస్తాను అని చెప్పు." అన్నాడు మి. క.

అయిదు నిమిషాలనంతరం తనశిష్యుడితోపాటు ఓ అపరిచిత వ్యక్తి లోనికి రావడం గమనించాడు మిస్టర్ కథల్రావు. గ్లాస్కో పంచ, సిల్కులాల్చి, దానిపైన కండువా, బుగ్గ మీసాలు, చేతి వేళ్ళకు బంగారపు ఉంగరాలు, మనిషి భారీగా వున్నాడు. తప్పక ఫిలింప్రొడ్యూసరయి వుంటాడు. తన్నదియ్యా — ఇన్నాళ్ళకు నన్నూ, నా టాలెంటునూ గుర్తించారన్న మాట.

"రచయిత మిస్టర్ కథల్రావు అంటే మీరే అనుకొంటా?" అన్నాడా అపరిచిత వ్యక్తి.

"ఆఁ ... ప్రఖ్యాత నవలా రచయిత మిస్టర్ కథల్రావు అంటే వీరేనండి, ప్లీజ్ బీ సీటెడ్." అన్నాడు శిష్యుడు.

"రెండు గోల్డుస్పాట్లులు తీసుకురా" అన్నాడు కథల్రావు.

"అవేం, యిప్పుడవన్నీ ఎందుకులెండి?" అన్నాడా వ్యక్తి.

మొహమాటానికి అలా అంటాడని తెలిసిన మిస్టర్ కథల్రావు వెంటనే టాపిక్ మార్చేస్తూ, "ఇంతకూ మీరు వచ్చిన పని...." అంటూ నసిగాడు.

మధ్యలోనే అందుకున్నాడా వ్యక్తి. "మీరు ఎన్నో కథలు-మరెన్నో నవలలు

రాశారని విని వచ్చాను." అన్నాడా వ్యక్తి.

"కాని నా నవలలు కథలు అన్నీ ప్రొడ్యూసర్లు, పబ్లిషర్లు కొనేశారే? అయినా ప్రస్తుతం ఓ మాంచి థ్రిల్‌తో కూడిన రొమాంటిక్ నావల్ రాస్తున్నాన్లెండి!" అన్నాడు మిస్టర్ కథ్రలావు అంత సూత్రం సెల్ఫ్ డబ్బా వాయించుకోకపోతే ఎలాగనుకొని.

అన్నిపత్రికాఫీసుల దర్శనాలు ముగించుకొని క్షేమంగా తిరిగొచ్చిన కథలు, నవలలతో నిండివున్న బీరువాలవైపు జాలిగా చూస్తున్నాడు శిష్యుడు.

"అది సరేనయ్యా బాబు. నీ రచనలు ఎలా అమ్ముతావో చెప్పు త్వరగా. అవతల నాకు బోలెడంత పనుంది."అన్నాడా వ్యక్తి.

తెల్ల కాగితాలవాడి కివ్వాల్సిన బాకీ, ఇంకు బాటిల్సు కొనిన అప్పు, రోజు రోజుకూ పెరిగిపోతున్న హోటల్ ఖాతాను ఓ సారి తలుచుకొంటూ. "నా రచనలు ఒక్కొక్కటి పాతిక ...." వాక్యం పూర్తి కానేలేదు.

"చంపేవు గదయ్యా! పోనీలేగదాని నీ రచనలకు న్యాయం కలుగజేద్దామని వస్తే యిదేనటయ్యా నువుచెప్పేరేటు?" అన్నాడా వ్యక్తి వెళ్ళడానికి లేవబోతూ.

మిస్టర్ కథ్రలావుకు మతిపోయినంత పనయింది.

రాక రాక ఎవరో తన నవల కొనడానికి వస్తే ఛాన్సు దొరికిందే చాలన్నట్టు తను ఎక్కువ రేటు చెప్పేశాడు. దాంతో వచ్చిన అతను హడలిపోయి వెళ్ళిపోతున్నాడు అనుకొన్నాడు మిస్టర్ కథ్రలావు.



"సారీ సార్! మీకు కష్టం కలిగించాను. పోనీ మీకే రేటయితే గిట్టుబాటుగా వుంటుందో చెప్పండి!" అన్నాడు వినయంగా.

"ఇదిగో మిస్టర్ కథ్రలావు! నాది ఒకటే మాట, ఒకటే రేటు నా మాటకు తిరుగులేదు. కేజీ మూడు రూపాయలు. నీకు ఓ పావలా ఎక్కువ యిచ్చుకొంటాను. ఇష్టమయితే అన్నీ కట్ట కట్టించి మీ శిష్యుడి నెత్తిన పెట్టి 'జయ అండ్ విజయ్' స్వీట్ స్టాల్‌కు పంపు. ఇదిగో అడ్వాన్సు"అని ఓ పదిరూపాయలనోటు మిస్టర్ కథ్రలావువైపు విసిరేసి వెళ్ళిపోయాడా వ్యక్తి.

మిస్టర్ కథ్రలావు అప్పటికేస్పృహ కోల్పోయాడు.

*